1. తనివి దీరఁ మే–ళ్లనుభవింప – నేను = నను సదా మేళ్లనెడి పచ్చిక – నదిమి మృదువుగఁ – బండు – కొనఁజేయును గనుక ॥నాకేమి॥
2. ఎంత శోధన – యెండ యున్న – నాకు = నెంతకు నోరిగర దెపుడు – శాంత జలములు – నా చెంతనే యుండుఁ గనుక ॥నాకేమి॥
3. తప్పిపోయిన నన్ – దారిం బెట్టి – నన్ను = తెప్పరిల్లఁజేసి నాకుఁ దీరు నలసటను – నా – తప్పు మన్నించున్ కనుక ॥నాకేమి॥
4. నీతి మార్గమునన్ – నిల్పున్ నన్ను – ప్రభువు = నీతి లేని నాకుఁ దనను – నీతి దయ చేయున్ – స్వ – నీతిని ద్రుంచున్ గనుక ॥నాకేమి॥
5. చావు చీఁకట్ల – శక్తియుండు – ఆహా = లోయలోఁబడి పోవలసినను – నే వెరవకుండు – నా – దేవుండే తోడు గనుక ॥నాకేమి॥
6. మీఁదఁబడునట్టి – శోధనలన్ – ధరను = నా దరికి రానీక దండము – నన్ను బ్రోచుచును – నా – కాదరణ యౌను గనుక ॥నాకేమి॥
7. పగవారల్ సిగ్గు – పడునట్లుగ – నా =జగము యెరుఁగని సౌఖ్యభో జన మగపరుచును – హా – తగినదే పెట్టున్ గనుక ॥నాకేమి॥
8. తన యాత్మానంద – తైలంబుతో – ప్రభువు = ననుదినము తలయంటి విసుగ – కొనక తుడుచును – నా కన్నీళ్లన్ని గనుక ॥నాకేమి॥
9. పలువిధములైన భాగ్యములతో – తండ్రి = వెలుపలికి దిగవెడలునట్టి –వెల గల గిన్నె – నా కలిమిగాఁ జేయున్ గనుక ॥నాకేమి॥
10. బ్రదుకంతటన్ గృ – పా క్షేమములు – నా = వదలకుండగ వచ్చు నాతో – సుదినములు గల్గ – నా – పదలు సంపదలౌ గనుక ॥నాకేమి॥
11. దురితంబు లుండు – ధరణి నాకు నిజము = నిరవు కాఁదిక నెప్పటికి నా – పరమ దేవుని – మం – దిరమె నా యిల్లు గనుక ॥నాకేమి॥

*– ముంగమూరి దేవదాసు*

## 15 యెహోవా నా కాపరి

(23వ దావీదు కీర్తన)

రా – శంకరాభరణము (చాయ: ఎంత ప్రేమ) తా – ఏక

యెహోవా నా కాపరి లే – మేమి గలుగదు = తన – మహా కృపతోఁ బ్రోచి నన్ను – మనుపు నాతఁడే॥



1. పచ్చికగల చోట్ల నను ప–రుండజేయుచుఁ – గడు – హెచ్చుగు సౌఖ్యములు సదా – యిచ్చు నాతఁడే ॥
2. శాంతికర జలములకు నను–సాగజేయుచు = వి–శ్రాంతి ప్రాణమున కొసంగు – విభుఁడు ఆతఁడే ॥
3. గాఢాంధకారమైన లోయల – గుండ బోయిన = నే–కీడుకు భయపడ నిఁక నా – తోడు ఆయనే ॥
4. దుడ్డుకఱ్ఱతో శత్రువులఁ – దరుమఁగొట్టుచుఁ = దన – దొడ్డ దండముతో నీతి – దారిలో నడుపు ॥
5. అందరిలో నన్ను నెంచి – యధిక ప్రేమతోఁ = గడు – విందు లొసఁగి తృప్తిపరుచు – విభుఁడు – ఆయనే ॥
6. ముఖము కళగా నుండునట్లు – మంచితైలమున్ = నా – సఖుఁడు నాకుఁ బూయుచుండు – సకల వేళలన్ ॥
7. బ్రదుకు దినము లన్నిట నాకు – బంటులవలెనే = నను – వెదకి కృపా క్షేమములు నా – వెంటవచ్చును ॥

*– సరెళ్ల నమూయేలు సుబ్బయ్య*

## 16 యెహోవా ప్రేమ

(23వ దావీదు కీర్తన)

రా – శంకరాభరణము తా – ఆది

యెహోవా నా మొఱ లాలించెను – దన – మహా దయను నను [1]గణించెను = [2]అహర్నిశల దీనహీనుఁడగు నా – దు [3]హాయనెడు ధ్వని – గ్రహించి [4]మనిపెను ॥యెహోవా॥

1. పిశాచి గడిమిఁబడఁగొట్టెను – దన – వశాన నను నిలువఁ బెట్టెను = [6]ప్రశాంత మధుర సు – విశేష [7]వాక్ఫల – [8]నిశాంతమునఁ జే – ర్చి [9]సేదఁ దీర్చెను ॥యెహోవా॥

---

[1]సంపాదించెను. [2]రాత్రియందు పగటియందు. [3]దుఃఖము చేతగలిగిన. [4]రక్షించెను. [5]శక్తి. [6]మిగుల నెమదిగల. [7]వాక్కుయొక్క ఫలమైన [8]గృహమున [9]అలత.